క్లుప్తంగా

నేడు కల్యాణ మహోత్సవం

కొడంగల్: మండల పరిధిలోని అన్నారంలో భూదేవి శ్రీదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు గ్రామంలో విగ్రహాల ఊరేగింపు అనంతరం గణపతి పూజ, నవ గ్రహ పూజ, హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించ నున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు స్వామి వార్ల కల్యాణోత్సవం ప్రారంభం కానుందని సర్పంచి అనిత, పురోహితుడు లక్ష్మీనారాయణ జోషి చెప్పారు.

మల్బరీ సాగుపై శిక్షణ నేడు

దోమ: మండల పరిధిలోని బట్లచందారం గ్రామంలో శుక్రవారం రైతులకు మల్బరీ పంటలో సస్య రక్షణ చర్యలు, పట్టు పురుగుల అధిక దిగుబడులపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పరిగి డివిజన్ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి వైజయంతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ఉంటుందని తెలిపారు. మల్బరీ సాగులో సస్యరక్షణ చర్యలు, పట్టు పురుగుల అధిక దిగుబడులు సాధించడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

నేటి నుంచి మల్లికార్జునుడి ఉత్సవాలు


ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్‌లో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు నేడు, రేపు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30గంటలకు అన్నదానం, 18న శనివారం 7.30గంటలకు స్వామివారి పల్లకీసేవా, గంగస్నానం, ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, ఒగ్గుడోలు ప్రదర్శనలు అనంతరం 11గంటలకు మహారుద్రాభిషేకం, రాత్రి స్వామివారి చిత్రపటం ఊరేగింపు 12గంటలకు దీక్ష విరమణ కార్యక్రమాలుంటాయని తెలిపారు. కార్యక్రమాల్లో గురుస్వాములు వెంకట్‌రెడ్డి, భీమప్ప, భీమరాయుడు, రాఘవేందర్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

నేత్ర శిబిరాన్ని వినియోగించుకోవాలి


కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచు లక్ష్మణ్

కుల్కచర్ల: కంటివెలుగు కార్యక్రమం ప్రతి ఇంటికి వెలుగు లాంటిందని సర్పంచ్ లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చాపలగూడెంలో నేత్ర శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు అమలుచేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, వైద్యాధికారులు మహేశ్వరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం తగదు'

బంట్వారం: నర్సరీ పనులను మరింత వేగిరం చేయాలని ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని సల్బత్తాపూర్ నర్సరీని సందర్శించి మాట్లాడారు. క్రమం తప్పకుండా మొక్కలకు నీరు పట్టాలని, మొక్కలు బాగా పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం తగదని, హరితహారం సీజన్ నాటికి మొక్కలు సిద్ధంగా ఉండాలని చెప్పారు. లక్ష్యం మేరకు నర్సరీలో మొక్కలు పెంచాలన్నారు.

ప్రజల మనిషి కేసీఆర్


రక్తదానం చేస్తున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

అనంతగిరి: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం వికారాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు. శిబిరంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనాలు నిర్మించరూ!

సొంత భవనాలు లేక అద్దె ఇళ్లు, సర్కారు బడుల్లో కార్యకలాపాలు సాగిస్తున్న గ్రామపంచాయతీలకు ఊరటనిస్తూ.. పక్కా భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిధులు విడుదల చేసి నెల రోజులు గడిచినా.. ఆ దిశగా ఏ గ్రామంలోనూ పునాది రాయి పడలేదు. అందుకు 'ఉపాధి' నిధులు కావడమేనని, బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుందన్న కారణంతో సర్పంచులు ముందుకు రావడం లేదన్న ప్రచారం జరుగుతోంది. దీంతో భవనాల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

- పక్కా భవనం కోసం ప్రజాప్రతినిధుల ఎదురుచూపు
- నిధులు మంజూరైనా.. ఖరారు కాని ముహూర్తం
- ప్రారంభం కాని నిర్మాణ పనులు
- 14 భవనాలు.. ఒక్కో జీపీకి రూ.20లక్షలు


శిథిలావస్థలో ఉన్న ఇండాపూర్ పంచాయతీ భవనం

దౌల్తాబాద్: దశాబ్దాలుగా గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేక స్థానిక ప్రజాప్రతినిధులు అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఎట్టకేలకు నిధులు మంజూరు చేసింది. నిధులు విడుదలై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ మండలంలో ఎక్కడా భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. గత నెల 7న రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినప్పటికీ.. పాలకులు, సంబంధిత అధికారులు పల్లెల్లో ఎక్కడా కూడా.. జీపీ భవనం కోసం భూమిపూజ చేయకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని పాత గ్రామపంచాయతీలతో పాటు నూతనంగా ఏర్పడిన జీపీలకు సైతం నిధులు మంజూరయ్యాయి.

ఒక్కో జీపీకి రూ.20లక్షలు

మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీలు ఉండగా దౌల్తాబాద్, కుదురుమళ్ల, గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, సురాయిపల్లి గ్రామాల్లో మినహా ఇతర ఏ పంచాయతీకి పక్కా భవనాలు లేవు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల్లో పంచాయతీ పాలనాపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తుండగా.. మరికొన్ని గ్రామాల్లో అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. అల్లాపూర్, బండివాడ, గుముడాల, కుప్పగిరి, లొట్టికుంటతండా, నందారం, నంద్యానాయక్‌తడా, నీటూరు, పోల్కంపల్లి, ర్యాలగుట్టతండా, సుల్తాన్‌పూర్, సురాయిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, యాంకి గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణం వ్యయం రూ.20లక్షలు కాగా ఉపాధిహామీ పథకం ద్వారా వీటి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో లేబర్ కంపోనెంట్ ద్వారా సమకూర్చిన మెటీరియల్ కంపోనెంట్ నిధులతో ఈ భవనాలు నిర్మించనున్నారు.

'ఉపాధి' నిధులు కావడంతో

ఉపాధిహామీ పథకంలో భాగంగా జీపీ భవనాలు మంజూరు కావడంతో నిర్మాణానికి ఎవరూ ముందుకురావడంలేదు. పనులు చేసినప్పటికీ అధికారులు నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తారని పలువురు ఆరోపిస్తున్నారు. సొంత ఖర్చులతో భవనాలు నిర్మించి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయవలసి వస్తుందని, అయినా డబ్బులు సకాలంలో చేతికి రావన్న కారణంతోనే సర్పంచ్‌లు జీపీ భవనాల నిర్మాణాలకు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. గ్రామపంచాయతీల్లో ఈజీఎస్‌లో భాగంగా ఇప్పటికే పలు నిర్మాణాలు చేపట్టినప్పటికీ.. ఖర్చు చేసిన నిధులు అందలేదని పలువురు వాపోతున్నారు.

త్వరగా ప్రారంభించాలి



గ్రామపంచాయతీ భవనాలు మంజూరైన విషయాన్ని స్థానిక సర్పంచులకు చెప్పాము. వారు త్వరగా భవన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. అన్నింటినీ వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాము. బిల్లుల్లో జాప్యం కాదని, సకాలంలో వచ్చేలా చూస్తామని వివరిస్తున్నాం.
– రవికిరణ్, ఏఈ, పీఆర్

పదో తరగతి విద్యార్థికి తొలిమెట్టు

- కష్టపడి చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలి
- మండల విద్యాధికారి హరిశ్చందర్


విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న విద్యాధికారి

పరిగి: కష్టపడి చదివితే తప్పకుండా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో.. వారికి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న అల్పాహారాన్ని గురువారం సుల్తాన్‌పూర్, మిట్టకోడూర్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెరుగైన ఫలితాలు రాబట్టే విధంగా కార్యచరణను రూపొందించుకోవాలని చెప్పారు. పదో తరగతి అనేది విద్యార్థికి తొలిమెట్టు లాంటిదన్నారు. కావున టెన్త్‌లో మంచి మార్కులు సాధించాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కావున ప్రతి విద్యార్థి కష్టపడి చదివి, మెరుగైన మార్కులను తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలే సాధనం.. గెలుపే గమ్యం

వ్యక్తిత్వ వికాస నిపుణుడు సేవక్ కుమార్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సేవక్ కుమార్

దోమ: విద్యార్థులు పట్టుదలతో చదివి విజయం సాధించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సేవక్ కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై సర్పంచ్ రాజిరెడ్డి, ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు ఖజాపాష నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు అన్నింటినీ వదిలి ఇంట్లో తల్లితండ్రులు, కళాశాలలో అధ్యాపకులు చెప్పిన మాటలనే వినాలని చెప్పారు. విద్యార్థి మెదడులో కంప్యూటర్లకున్న పరిజ్ఞానం ఉంటుందని, దాన్ని మన లక్ష్యానికి అనుగుణంగా మార్చుకుంటే అనుకున్నది సాధించడం సులభతరం అవుతుందన్నారు. సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం కోసం సేవక్ కుమార్ లాంటి నిపుణుల సలహాలు ఎంతో అవసరం అన్నారు. ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ.. సన్మార్గంలో నడవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు శ్రీధర్, నాజీనిన్, సునీత, కుమార్, సురేశ్, హరికృష్ణ, వార్డు సభ్యుడు ఖజామైనోద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తాండూరు టౌన్: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోటీలో నియోజకవర్గం నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ ప్రతినిధులు దీపక్‌రెడ్డి, పరమేష్‌లు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు తమ సొంతం కావాలనే ఉద్దేశంతో ప్రత్యేక రాష్ట్ర కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన సీఎం కేసీఆర్ త్యాగనిరతి వెలకట్టలేనిదని కొనియాడారు. ఆయన పోరాటస్ఫూర్తి విద్యార్థులందరికీ ఆదర్శనీయంగా ఉండాలనే ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీలో విజేతలకు నేడు (శుక్రవారం) నగదు పురస్కారం అందజేయనున్నట్లు వెల్లడించారు.

మట్టిరోడ్లకు మహర్దశ

- రూ.3.20కోట్లు మంజూరు
- మార్చిలోపు పనులు పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలు


దౌల్తాబాద్‌లోని ఓ కాలనీ అంతర్గత రోడ్డు దుస్థితి

దౌల్తాబాద్: గ్రామాల్లోని మట్టిరోడ్లకు మహర్దశ పట్టనుంది. మట్టిరోడ్లను సీసీ దారులుగా మార్చి.. రవాణ సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద.. మండల పరిధిలోని గ్రామాల్లో రూ.3.20కోట్ల నిధులతో సీసీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో అంతర్గత రాహదారులు గుంతలమయంగా మారి మురుగునీరు నిలుస్తూ అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాలతో ఆ పరిస్థితి మారనుంది. ఈ పనులు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలని అధికారులు సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకురావడం గమనార్హం.

రోడ్ల పరిస్థితి అధ్వానం

చాలా గ్రామాల్లో కొత్తగా కాలనీలు ఏర్పాటయ్యాయి. అయితే కాలనీలకు అంతర్గత రోడ్లులేక వర్షాకాలంలో నడవలేని స్థితి. దీంతో ఆయా గ్రామాల్లోని పరిస్థితిని స్థానిక ప్రజాప్రతినిధులు సీసీరోడ్లు మంజూరు చేయాలని అధికారులను కోరగా.. ఉపాధి పథకం కింద సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అయితే ఈ రోడ్ల నిర్మాణాలను ఆయా గ్రామాల సర్పంచులకు వివరించారు. మార్చిలోగా పనులు పూర్తి చేస్తే త్వరగా బిల్లులు వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు.

వైద్యుల పనితీరు భేష్

సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి


రక్త పరీక్ష చేయించుకుంటున్న రాజిరెడ్డి

దోమ: రక్త నమూనాల సేకరణలో వైద్యుల పనితీరు ఎంతో మెరుగ్గా ఉందని, నమూనాల సేకరణలో జిల్లాలోనే పీఎచ్‌సీ రెండో స్థానంలో నిలిచిందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి మాట్లాడారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల నుంచి వచ్చే ఓపీ పేషెంట్లకు వైద్యులు అందిస్తున్న సేవల గురించి.. డాక్టర్ విద్యను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడే కిడ్నీ ఫంక్షన్, షుగర్, బీపీ, థైరాయిడ్, రక్త ప్రసరణ తదితర టెస్టులు చేస్తున్నామని వైద్యురాలు తెలిపారు. ప్రతి రోగికి మెరుగైన సేవలను అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ఎంతో కృషి చేస్తుందని రాజిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్ గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

కుల్కచర్ల: రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పరిగి వ్యవసాయ సంచాలకులు లక్ష్మీకుమారి అన్నారు. గురువారం చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామంలో పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి భావన తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు..


రామలింగేశ్వర స్వామి ఆలయం

పూడూరు: మహాశివరాత్రి సందర్భంగా దామగుండ రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. శివరాత్రిని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు.. స్వామిని దర్శించుకొని, దీక్షలు విరమిస్తారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసింది.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత


ఫార్మేషన్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్

పెద్దేముల్: రైతుల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వంపనిచేస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ.5లక్షల సీడీపీ నిధులతో మంజూరైన ఫార్మేషన్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి చొరవతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పెద్దేముల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి రంగయ్య, యూత్ ప్రధాన కార్యదర్శి బంగ్ల రఘు, వెంకటయ్య, నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా చెన్నకేశవరెడ్డిని గెలిపించండి

కుల్కచర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూటీఎస్ సంఘం బలపరిచిన చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజులు అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలలు, కస్తుర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ అని చెప్పారు. సంఘం బలపరిచిన అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంఘం నాయకులు నర్సింహులు, రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు భూముల్లో ఇళ్లకు అనుమతించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కుల్కచర్ల: అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని పుర్సంపల్లి గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం చౌడాపూర్ తహసీల్దార్ అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచు వెంకటయ్య మాట్లాడుతూ... గ్రామంలో చాలామందికి ఇళ్లు లేవని, గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పర్గి అశోక్, నాయకులు పెంటయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకుడు


లక్ష్మీనారాయణకు కండువా కప్పుతున్న బండి సంజయ్

కొడంగల్: పట్టణానికి చెందిన వ్యాపారి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోట్రికె లక్ష్మీనారాయణ గుప్తా గురువారం బీజేపీ పార్టీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో కాషాయం కండువా కప్పుకున్నారు. పరిగి నియోజకవర్గంలోని రూప్‌ఖాన్‌పేటలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గుప్త మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు పున్నం చంద్ లాహోటీ, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో సీఎం రియల్ దందా!

- బెల్ట్ దుకాణాలతో పేదలను దోచుకుంటున్న ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ తీవ్ర ఆరోపణలు


తరిగొపుల గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

ధారూరు: పచ్చని పల్లెల్లో ప్రభుత్వం బెల్టు దుకాణాలు పెట్టి.. పేదల బతుకుల్లో చిచ్చు పెడుతుందని, వారిని ఆర్థికంగా దోచుకుంటుందని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా గురువారం ధారూరు మండలం తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలో దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములను ముఖ్యమంత్రి కేసీఆర్ లాక్కుంటూ రియల్ దందా చేస్తున్నారంటూ తీవ్రంగా విమర్శించారు. మోమిన్‌పేట్ మండలం ఎన్కెతల గ్రామంలో 1200 ఎకరాల అసైన్డ్ భూములను అతి తక్కువ ధరకు గుంజుకొని, తన కొడుకు కేటీఆర్ మిత్రుడికి కట్టబెట్టి సొమ్ముచేసుకున్నారని, నవాబుపేట మండలం ఆర్కతల గ్రామంలో ఇలాగే పేదల అసైన్డ్ భూములను లాక్కున్నారని ఆరోపించారు. లాక్కున్న భూములను తిరిగి పేదలకే పంపిణీ చేయిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధి పథకం జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.12 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పేదలకు మేలు జరగాలన్నా.. అభివృద్ధి పనులు కొనసాగాలన్నా.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా.. మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో తరిగొపుల గ్రామానికి చెందిన 20 బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కోల్కొంద సంతోష్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, పార్టీ నాయకులు మహ్మద్ బాబాకాన్, బల్వంత్‌రెడ్డి, మల్లారెడ్డి, గఫార్, బుజ్జయ్యగౌడ్, ముజాఫర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని కలిసిన బీజేపీ నేత


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

పరిగి: ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర నేత, మాజీ మంత్రి చంద్రశేఖర్ కలవడం చర్చనీయాంశంగా మారింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ గురువారం పరిగికి వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డిలు కార్యక్రమానికి వస్తున్న క్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డిని కలిసేందుకు ఇంటికి వెళ్లారు. హరీశ్వర్‌రెడ్డి లేకపోవడంతో ఎమ్మెల్యేను కలిసి పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పరిగికి వస్తున్న క్రమంలో ఆ పార్టీ నేతలు ఎమ్మెల్యేను కలవడం చర్చనీయాంశంగా మారింది.